క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



ఈవోకు చెక్కు అందజేస్తున్న వడ్డమూడి సరోజిని

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వడ్డమూడి సరోజిని తన భర్త రమేష్‌బాబు జ్ఞాపకార్థం రూ.1,00,116 విరాళంగా, అలాగే వీరమనేని వీరభూపయ్య, నాగభూషణమ్మల జ్ఞాపకార్థంగా కూడా రూ.1,00,116 విరాళాన్ని నిత్యాన్నదాన ట్రస్టుకు సమర్పించారు. ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌కు విరాళ చెక్కును ఆదివారం అందజేశారు. పాలక మండలి సభ్యుడు మండవల్లి రవి, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించండి

అరసవల్లి: నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేట పరిధిలో గల సీపాన వీధిలో మూడు రోజులుగా విద్యుత్ లో ఓల్టేజ్ సమస్యతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు కాలనీ వాసులు ఈపీడీసీఎల్ ఈఈ బయ్యన్నాయుడుకు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. వెంటనే అధిక సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు



విశేష పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గార: మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రామర్తి బాల భాస్కరన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో కింతలి అమ్ములు, కింతలి కృష్ణారావు, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మార్పు ధర్మారావు, స్థానిక సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిషుపై పట్టు సాధించాలి



అవగాహన కల్పిస్తున్న షణ్ముఖరావు

లావేరు: విద్యార్థులు ఇంగ్లిషు భాషపై పట్టుసాధించాలని రిసోర్సు పర్సన్ పి.షణ్ముఖరావు అన్నారు. మురపాకలోని శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు ఇంగ్లిషు సులభంగా నేర్చుకోవడంపై ఆదివారం అవగాహన కల్పించారు. భయం వీడితే ఇంగ్లిషు నేర్చుకోవడం చాలా ఈజీ అన్నారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజశ్యామల యాగానికి ఆహ్వానం



స్వరూపా నరేంద్ర సరస్వతికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న అప్పలనాయుడు

లావేరు: పెదలింగాలవలస గ్రామంలో జూన్ 9, 10, 11 తేదీల్లో సర్పంచ్ లుకలాపు యశోద, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అప్పలనాయుడు సౌజన్యంతో రాజశ్యామల యాగం నిర్వహిస్తున్నారు. యాగంలో పాల్గొనాలని కోరుతూ విశాఖలోని శారదా పీఠాధిపతి స్వరూపానరేంద్ర సరస్వతిని ఆదివారం కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. యాగ కార్యక్రమాలను అప్పలనాయుడు పీఠాధిపతికి వివరించారు. ఆయనతో పాటు కొత్తకోట, గోవిందపురం పంచాయతీల మాజీ సర్పంచ్‌లు కొండయ్య, నాగరాజు, గొర్లె రామినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల క్రాంతి, పతివాడ గురునాయుడు, లంకలపల్లి మల్లేశ్వరరావు ఉన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో గల విజయగణపతి ఆలయ ప్రాంగణంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. పేర్ల శోభారాణి, వేణుగోపాల్, కె.వి.రామేశ్వరరావు, అబ్దుల్ షుభాని షేక్ సుజాతలతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

రైతుల చెంతనే మొక్కజొన్న కొనుగోలు

- వారం లోపే నగదు జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



గురుగుబిల్లిలో రైతులు వద్దకే వెళ్లి మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తున్న అధికారులు

లావేరు: రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారు. సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ అండగా నిలుస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండిస్తున్న పంటలను కూడా సకాలంలో కొనుగోలు చేస్తూ నగదును సైతం వెంటనే బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. మొక్కజొన్న పంటను రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. దీంతో వ్యవసాయశాఖ, పీఏసీఎస్ అధికారులు అన్నదాత వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. మొక్కజొన్న పంట సాగు చేసిన సమయంలో క్వింటా ధర రూ. 2,200 నుంచి రూ. 2,400 వరకూ ఉండేది. అయితే పంట తీసి అమ్మకానికి సిద్ధం చేసిన సమయంలో వ్యాపారులు సిండికేట్‌గా మారి క్వింటా ధర 1800 రూపాయలకు తగ్గించేశారు. ఒక్కసారిగా క్వింటాకు రూ. 400 నుంచి రూ. 600 వరకూ తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ సమయంలో ప్రభుత్వం మొక్కజొన్న పంటను క్వింటా 1962 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తామని ప్రకటించడంతోపాటు వెంటనే కొనుగోళ్లను ప్రారంభించింది. పంట సాగు సమయంలో ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతుల వద్దకు వ్యవసాయశాఖ, పీఏసీఎస్ అధికారులు వెళ్లి పంట నాణ్యతను పరిశీలించి గోనెసంచులు ఇచ్చి పంటను కొనుగోలు చేసి లారీల ద్వారా ప్రభుత్వ గొడౌన్లకు తరలిస్తున్నారు. పంటను కొనుగోలు చేసిన వారం రోజుల్లోపే బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమవుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బయట వ్యాపారులకు మొక్కజొన్నను విక్రయిస్తే నెలల తరబడి డబ్బులు ఇచ్చేవారు కాదని రైతులు చెబుతున్నారు.

ఆనందంగా ఉంది



తాను 43 క్వింటాళ్ల మొక్కజొన్న పంటను పండించాను. బయట వ్యాపారులు క్వింటా 1800 రూపాయలకు మాత్రమే పంటను కొనుగోలు చేస్తామన్నారు. దీంతో ప్రభుత్వానికి పంటను విక్రయిస్తానని చెప్పడంతో వ్యవసాయశాఖ, పీఏసీఎస్ అధికారులు నా వద్దకు వచ్చారు. గోనె సంచులు ఇచ్చి పంటను కొనుగోలు చేసి లారీ ద్వారా తీసుకువెళ్లడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం పంటను కొనుగోలు చేయకపోతే నష్టపోయేవాడిని.

-పల్లంటి రమణ, రైతు, కేశవరాయునిపురం, లావేరు మండలం

ఐదు రోజుల్లోనే నగదు జమ



తాను 60 క్వింటాళ్ల మొక్కజొన్నను పండించాను. బయట వ్యాపారులు క్వింటా 1800 రూపాయలకు మించి కొనుగోలు చేయలేమన్నారు. ప్రభుత్వం క్వింటా 1962 రూపాయలకు కొనుగోలు చేయడంతో వారికే విక్రయించాను. పంట ఇచ్చిన ఐదు రోజుల్లోనే నా బ్యాంకు ఖాతాకు డబ్బులు జమయ్యాయి.

-అల్లంపల్లి అప్పారావు, రైతు, లావేటిపాలెం, లావేరు మండలం

ఘనంగా మంత్రి ధర్మాన పుట్టినరోజు



గార: వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపిస్తున్న నాయకులు



గార: శ్రీకూర్మనాథాలయంలో కేక్ కట్‌చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు



శ్రీకాకుళం అర్బన్: నిత్యావసర వస్తువులు అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్

గార: మండల కేంద్రంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ పీస శ్రీహరిరావు ఆధ్వర్యంలో ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి తదితరులు కాలిహిందం కొండపైన వేణుగోపాలస్వామి ఆలయంలో మంత్రి ధర్మాన పేరిట ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకొన్నారు. నిబద్ధత, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నాయకుడు ధర్మాన ప్రసాదరావు అని, ఆయన నాయకత్వంలో పనిచేయడం నాయకులు, కార్యకర్తలు ఉ అదృష్టంగా భావిస్తున్నారన్నారు. పీస గోపి, ముంజేటి కృష్ణమూర్తి, కొయ్యాన నాగభూషణం, యాళ్ల నారాయణమూర్తి, మార్పు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకూర్మనాథాలయంలో..

శ్రీకూర్మనాథాలయంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ బరాటం రామలక్ష్మి, బాలకృష్ణ ఆధ్వర్యంలో పూజలు అనంతరం కేక్ కట్ చేశారు. సర్పంచ్ గోరు అనిత, పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమాజ సేవ చేయాలి..

శ్రీకాకుళం అర్బన్: సమాజసేవ చేయడంలో యువత ముందుండాలని ది న్యూ ఫ్రెండ్స్ ఆఫ్ ఎర్త్ వలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్ అన్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పుట్టినరోజును పురస్కరించుకుని నగరంలోని జెహరా మనోవికాస్ కేంద్రంలో మానసిక వికలాంగులకు నిత్యావసర వస్తువులు దుప్పట్లు అందజేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్నేని హరిబాబు, పలువురు ప్రతినిధులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, డాక్టర్ చిలిబల్లాబు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- ధ్వంసమైన అరటితోటలు



లావేరు: లింగాలవలసలో నేలమట్టమైన అరటి పంట



జి.సిగడాం: నేలమట్టమైన అరటితోటను పరిశీలిస్తున్న అధికారులు

లావేరు/జి.సిగడాం: మూడు రోజులుగా ఈదురుగాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. దీంతో అరటితోటలు ధ్వంసమవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 19న జీడీ రాత్రి వీచిన గాలులతో లావేరు, జి.సిగడాం మండలాల్లోని పలు గ్రామాల్లో అరటితోటలు మామిడిపండ్లకు నష్టం వాటిల్లింది. శని, ఆదివారాల్లో కూడా గాలులు వీయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. లావేరు మండలంలోని పెదలింగాలవలస, లావేటిపాలెం, కేశవరాయునిపురం, లావేరు, గోవిందపురం, అప్పాపురం, వెంకటాపురం, పోతయ్యవలస గ్రామాల్లో, జి.సిగడాం మండలంలో ఉల్లివలస, ఎల్లయ్యపేట, బూటుపేట, పున్నాం, తొగులీట గ్రామంలో అరటితోటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. పంట చేతికొచ్చే సమయంలో వీచిన గాలులతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడిపెట్టి సాగు చేసిన పంట గాలులతో పోవడంతో నష్టాన్ని చవిచూశామని వాపోతున్నారు.

ఉద్యానవనశాఖాధికారుల పరిశీలన

జి.సిగడాం మండలంలో అరటి తోటలను ఉద్యానవనశాఖ అధికారిణి అనుషా, అగ్రికల్చర్ అసిస్టెంట్ కుమార్‌లు సునీతాకరావు పరిశీలించారు. పున్నాం, ఉల్లివలస, బొతుపేట, ఎల్లయ్యపేట, బూటుపేట, ముషినివలస, సర్వేశ్వరపురం గ్రామాల్లో రైతులు సాగు చేసిన అరటి పంటపై ఈదురుగాలులతో నేలపాలైన పంటలను పూర్తిస్థాయిలో సర్వే చేస్తున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని అనుషా తెలిపారు.

సత్యసాయి విగ్రహ ప్రతిష్టకు రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న అంధవరపు ప్రసాద్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న సత్యసాయి సేవా సమితి పెద్దమందిరానికి సత్యసాయిబాబా విగ్రహ ప్రతిష్ట నిమిత్తం రూ.లక్ష చెక్కును ఆదివారం చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ అంధవరపు ప్రసాద్ అందజేశారు. ఈ నెల 31న ఏర్పాటు చేయనున్న సత్యసాయి బాబా విగ్రహ ప్రతిష్టకు ఈ విరాళాన్ని రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు చేతుల మీదుగా మందిరం కన్వీనర్ కె.ముకేశ్వర్లకు అందించారు. అనంతరం ప్రసాద్‌ను సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు, జిల్లా సమన్వయకర్త సూర రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తపేట గ్రామ సచివాలయం పరిధిలోని ఎస్.ఎం.పురంపేట, దోమాం గ్రామాల్లో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతోందని.. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

శ్రీకాకుళం క్రైమ్: పట్టణంలోని హయతినగరం సమీపంలో జూదం ఆడుతూ ఐదుగురు వ్యక్తులు పట్టుబడినట్టు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ ఆదివారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.24,450 నగదు, ఆరు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నామన్నారు. పోస్టు పెట్టి ద్విచక్ర వాహనాలు ఏడు సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు.

టైలరింగ్‌తో ఉపాధి



సర్టిఫికెట్లను చూపిస్తున్న మహిళలు

ఆమదాలవలస: సత్యసాయి సేవా సంస్థలు, ఆమదాలవలస లక్ష్మీనగర్ సత్య సాయి అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకం కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో టైలరింగ్, మగ్గం వర్క్‌పై 40 మంది శిక్షణ ఇచ్చారు. వీరికి సత్య సాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం కొత్త బ్యాచ్‌లో 25 మందికి మగ్గం వర్క్, 35 మందికి టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిక్షణ పొందిన మహిళలు దరూ స్వయం ఉపాధికి కృషిచేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ ఎస్.రామచంద్రరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌ఛార్జి బోయిన నరసింహమూర్తి, రాష్ట్ర విద్యాజ్యోతి ఇన్‌ఛార్జి శిరసాన సాయి గురుప్రసాద్, జిల్లా మెడికల్ ఇన్‌ఛార్జి డాక్టర్ పి.తాతయ్యలు, పారిశ్రామికవేత్త జె.జె.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న వేసవి శిబిరాలు



క్రాఫ్టులో శిక్షణ ఇస్తున్న దృశ్యం



సంగీతంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు



పెయింటింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్:

నగరంలోని పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం చిత్రలేఖనం, పెయింటింగ్, క్రాఫ్ట్, భరతనాట్యం అంశాలపై చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. 150 మంది చిన్నారులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో సంగీతం టీచర్ పెంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులకు సంగీతంపై శిక్షణ ఇచ్చారు. నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బి.ఎం.ఎస్.పట్నాయక్, ప్రసాద్, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వ్యాకరణంపై అవగాహన



తెలుగు వ్యాకరణంపై అవగాహన కలిగిస్తున్న ఉపాధ్యాయుడు సాయికృష్ణారావు

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులకు తెలుగు వ్యాకరణంపై ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎస్.సాయికృష్ణారావు అవగాహన కల్పించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 14వ రోజు ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. అలాగే ప్రభుత్వ ఉపాధ్యాయులు టి.వి.రామ్ జనరల్ నాలెడ్జిపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు రమేష్ సైన్స్ పాఠాలు బోధించారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి.వి.జి.శంకరరావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలని బలగ గ్రంథాలయశాఖ అధికారి పి.ఉగ్రేసేన అన్నారు. బలగ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఇంగ్లిష్ రైమ్స్, స్టోరీస్ విద్యార్థులతో చెప్పించారు. పర్యావరణంపై డ్రాయింగ్ పోటీలు పెట్టారు. 25 మంది చిన్నారులు, సహయకురాలు కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల నియామకం

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రానున్న విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీంట్లో భాగంగా నాలుగు సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించింది. గత ఏడాదే తరగతులు నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంట్లో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతుల నిర్వహణకు ఇంటర్ బోర్డు సిద్ధం అవుతోంది. కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఇంగ్లిష్, జూవాలజీ అధ్యాపకులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, ఎంపీటీసీ నడిమింటి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు సంగిరి నర్సింగరావు, సతివాడ రామినాయుడు, పోలాకి రమణయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విశ్వ బ్రాహ్మణులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక కంచికామాక్షి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విశ్వబ్రాహ్మణ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే విశ్వబ్రాహ్మణులు లబ్ధి చేకూరుతోందన్నారు. సంఘ నాయకులు మాట్లాడుతూ.. ఆధునిక యంత్రాలు రావడంతో గ్రామాల్లో చేతి వృత్తులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను ఇప్పటికే ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రతి గ్రామంలో సుమారు పది నుంచి 25 విశ్వబ్రాహ్మణ కుటుంబాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కుటుంబానికి రుణాలతో పాటు పనులు కూడా కల్పించాలని కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బూరాడ వెంకటరమణ, సర్పంచ్ సాకేటి నాగరాజు, సనపల శ్రీనాథరావు, కొండపల్లి సూర్యనారాయణ, చరిణి అప్పలరాజు, బొద్దూరు సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

సేవకులకు సత్కారం



సన్మానం పొందిన వలంటీర్లతో నాయకులు

జి.సిగడాం: గ్రామ వలంటీర్ల సేవలు అభినందనీయమని వక్తలు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సేతుభీమవరం గ్రామ సచివాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వలంటీర్లను మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, సర్పంచ్ తొత్తడి రామారావు, ఎంపీటీసీ సభ్యురాలు కుదిరెళ్ల సుజాత సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కుదిరెళ్ల గోవిందరావు, శ్రీనాథరావు, ఆదినారాయణ, కనకరావు, రాంబాబు, బంటాల సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి వేసవి వెన్నెల, బాలవికాస్ శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. వేసవి వెన్నెల పేరుతో గత 10 రోజులుగా విద్యార్థులకు చిత్రలేఖనం, క్రాఫ్ట్, పాటలు, సంగీతం అంశాలపై శిక్షణ ముగింపు కార్యక్రమం పెద్ద మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ యువతీ, యువకులకు ఆధ్యాత్మికతతో పాటు జీవితం గడపడానికి ఈ శిక్షణలు ఉపకరిస్తాయన్నారు. కుటుంబానికి సమాజానికి, దేశ సేవకు ఉపయోగపడే వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా తరగతులు నిర్వహించిన ప్యాకల్టీ సభ్యులకు సత్కారం చేశారు. ఆర్.కమలా త్రివేణి, జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు, జిల్లా సమన్వయకర్త సూర రామచంద్రరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌ఛార్జి బోయిన నరసింహమూర్తి, మందిరం కన్వీనర్ కె.మురళీకృష్ణ, రాష్ట్ర ప్యాకల్టీ సుధారాణి, జిల్లా మహిళా సమన్వయకర్త లలిత, అమ్మాయమ్మ, బాలవికాస్ జిల్లా పరిధికారుల ఎ.సూర్యకళ, శశికాంత్, భానుమూర్తి, శివనారాయణ, తదితరులు పాల్గొన్నారు.